క్లుప్తంగా

రేపు సద్దుల బతుకమ్మ



సద్దుల బతుకమ్మ వేడుకల నిర్వహణపై చర్చిస్తున్న గ్రామ పెద్దలు

శాయంపేట : మండల కేంద్రంలో ఈ నెల 30న సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు జిన్నా ప్రతాప్ సేనారెడ్డి, శ్రీ మత్స్యగిరి స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, అన్ని కుల సంఘాల పెద్దలు చర్చించారు. ఈ సందర్భంగా మంగళవారం సద్దుల బతుకమ్మ సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని, గ్రామస్తులు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వంగరి సాంబయ్య, చిందం రవి, బాసాని ప్రకాశ్, గిద్దమారి సురేష్, నడిగొట్టు సాంబయ్య, బాసాని నవీన్, మామిడి ప్రమోద్, మోరె రంజిత్, లోకలబోయిన కుమారస్వామి, నడిగొట్టు అశోక్, పున్నం అఖిల్, నడిగొట్టు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పెరిక సంఘం కమిటీ ఎన్నిక



ఆత్మకూరు : పెరిక సంఘం నూతన నీరుకుళ్ల కమిటీని ఆదివారం ఎన్నికున్నారు. అధ్యక్షుడిగా పత్తిపాక చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా సింగతి రమేశ్, ప్రధానకార్యదర్శిగా లక్కర్సు రాజు, సహాయకార్యదర్శిగా లక్కర్సు జగదీశ్వర్, కోశాధికారిగా అంకతి రాజు, ప్రచారకార్యదర్శిగా కీత రాజు, కార్యవర్గ సభ్యులుగా లక్కర్సు రాకేష్, పోతరాజు రాంబాబు, లక్కర్సు సుధాకర్, అంకతి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ పెరిక సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

దసరా వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



ధర్మసాగర్ : మండల పరిధిలోని గ్రామాల్లో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ శ్రీధర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం పలు గ్రామాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు దసరా ఉత్సవాల సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, బతుకమ్మ, దసరా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపకోవాలని సూచించారు. అదేవిధంగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ఎలాంటి జీవహింస చేయకూడదని సూచించారు.

పండగ వేళ.. ప్రయాణికుల రద్దీ



బస్సుల కోసం పరకాల బస్టాండ్‌లో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

పరకాల : పండుగ రావడమే పాపం ఆర్టీసీలో ప్ర యాణించడం, ప్రయాణికులకు ఓ నరకం కనిపిస్తుంది. మారుమూల ప్రాంతాలతో పాటు పట్టణాలకు వెళ్లే ప్రతి బస్సు నిత్యం రద్దీగా మారాయి. బస్టాండ్లలో బస్సులు లేక ఒక వైపు బస్సులు రాగానే సీట్ల కోసం తోపులాటలతో గొడవలు చోటుచేసుకుంటున్నాయి. పండుగల సమయంలో అదనపు బస్సులు నడుపకుండా ఆర్టీసీ యాజమాన్యం చోద్యం చూడటంతో ఒక్కో బస్సులో రెట్టింపుగా సుమారు 90 నుంచి 120 మందికి పైగా ప్రయాణిస్తున్నారు. దీంతో బస్సుల్లో వృద్ధులు, చిన్నారులు ఊపిరి ఆడక ఇబ్బందులు పడుతుంటే మహిళలు సీట్ల కోసం గొడవలు పెట్టుకుంటున్నారు. పండుగల సమయంలో లాభాలు చూసుకునే ఆర్టీసీ అధికారులు..అదనపు బస్సులు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా చెప్పవచ్చు.



శిథిలావస్థలో జీపీ భవనం

- గోడలకు పగుళ్లు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో జీపీ అధికారులు భయం భయంగానే పాలన కొనసాగిస్తున్నారు. జీపీ భవనం శిథిలావస్థకు చేరడం, సరైన సౌకర్యాలు లేకపోవడంతో అధికారులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పగుళ్లు ఏర్పడిన గోడలు

జీపీ భవనాన్ని 30 ఏళ్ల క్రితం నిర్మించగా ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరగా గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షానికే గోడల నుంచి భవనం లోపలికి నీరు వరద రూపంలో రావడంతో బకెట్లతో నీటిని బయట పారబోయాల్సిన పరిస్థితి ఎదురైంది. అంతేకాకుండా గ్రామ పంచాయతీ భవనం స్థలం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో జీపీ భవనం వెనుకకు వర్షం నీరు చేరి చిన్నపాటి కుంటను తలపిస్తుంది. సర్పంచ్, సిబ్బంది కూర్చోవడానికి గదులు లేక ఇరుకుగా ఉండడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసినప్పటికీ నేటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మించి ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రామ పంచాయతీ భవనం



భవనానికి పగుళ్లు ఏర్పడిన గోడలు



భవనం వెనుక వర్షం నీటితో కుంటలా ఏర్పడిన లోతట్టు ప్రాంతం

ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి



వర్షాకాలంలో గ్రామ పంచాయతీ ఆవరణం అంతా నీటితో నిండి పోతుందని, ఎప్పుడు కూ లుతోందని భయంతోనే అధికారులు పాలన సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి.

– వంగరి సాంబయ్య, తెలంగాణ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి



దామెర : అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వెంకట్రామిరెడ్డి

దామెర : అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి అన్నారు. దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ల్యాదెళ్లలో ఏర్పాటు చేసిన సామూహిక హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలందరూ ఆనందంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుమార్, ఇందిరా, ప్రవీణ్, కీర్తి, రతన్‌కుమార్, ప్రశాంత్, సుధాకర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: దుర్గామాత వద్ద పూజలో పాల్గొన్న భక్తులు

కాళరాత్రి అవతారంలో దుర్గామాత

ఆత్మకూరు : మండలకేంద్రంలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని కాళరాత్రి అవతారంలో అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

నేడు పరకాలలో సద్దుల బతుకమ్మ

- ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల: ఈ నెల 29న జరుగనున్న పరకాల పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలకు భక్తులు ఇబ్బందులు పడకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. పట్టణ కేంద్రంలోని దామెర చెరువు, పశువుల సంత వద్ద జరుగనున్న సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొననున్న దృష్ట్యా అధికారులు పూర్తి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఆయన వెంట పరకాల మున్సిపల్ కమిషనర్ కె.సుష్మ, సీఐ క్రాంతికుమార్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వేద పండితులతో ఎమ్మెల్యే సమావేశం

తెలంగాణ సంస్కృతి, ఆచార ప్రకారం 9వ రోజును సద్దుల బతుకమ్మ పరిగణించడం జరుగుతుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి వేద పండితులు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన వేదపండితులతో సమావేశం కాగా ఈ నెల 29న సద్దుల బతుకమ్మ, అక్టోబర్ 2న విజయదశమి జరుపుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాలతో సంబంధం లేకుండా పరకాలలో వేద పండితుల సూచనల మేరకు పండుగ జరుపుకోవాలని. అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని పరకాల మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులను ఆదేశించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

భవన నిర్మాణ కార్మికులకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

ఐనవోలు: భవన నిర్మాణ కార్మికులకు నెలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలని, రెన్యూవల్ లేకుండా జీవిత కాలం కొనసాగే లేబర్ కార్డులు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్సీ ఫంక్షన్ హాల్‌లో యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రథమ మహాసభ సుదర్శన్, బోళ్ల వెంకటస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పలయ్య మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రైవేటు కంపెనీలకు ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహించాలని అన్నారు. జీఓ నంబర్ 12ను వెంటనే రద్దు చేయాలని మహాసభలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కాడబోయిన లింగయ్య మాట్లాడుతూ 10 గంటలు పనిచేయించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. వెంటనే ఇలాంటి ఆలోచనలను ఉపసంహరించుకోవాలని హితవు పలికారు. అనంతరం యుబీడబ్ల్యూయూ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోళ్ల వెంకటస్వామి, గౌరవ అధ్యక్షుడిగా ఇస్రం బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోలెపాక అనిల్, సహాయ కార్యదర్శిగా రామిళ్ల వెంకటస్వామి, ఉపాధ్యక్షుడిగా మాదాసి వెంకటస్వామి లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అలకుంట యాకయ్య, యాకూబ్‌లు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

బతుకమ్మ మైదానాలు సిద్ధం



సిద్ధమైన ఇప్పలకుంట మైదానం

ఆత్మకూరు : మండలంలో బతుకమ్మ ఆడుకోవడానికి మైదానాలు సిద్ధం చేశారు. ఇప్పలకుంట, చెరువు వద్ద మైదానాలను చదును చేసి లైటింగ్స్ ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ముందుచూపు లేని పాలకులు

- బతుకమ్మ ఏర్పాట్లపై బీజేపీ నాయకుల మండిపాటు



బతుకమ్మ పనులను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

పరకాల: బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ నాయకులు ఆరోపించారు. రూ.25 లక్షలతో పరకాల పశువుల సంత, దామెర చెరువు కట్ట వద్ద జరుగుతున్న పనులను బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. రెండు నెలల క్రితం దామెర చెరువు మట్టిని అమ్ముకున్న అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ముందస్తుగా పశువుల సంతను మట్టితో చదును చేస్తే నేడు బతుకమ్మకు చేరుకునే మహిళలు ఇబ్బందులు పడే అవకాశం లేకుండా పోయేదని ఆందోళన వ్యక్తం చేశారు. పండుగకు కొద్ది రోజుల ముందు నీటి గుంతలను మొరంతో చదును చేయడంతో మహిళలకు కష్టాలు తప్పవని అన్నారు. బతుకమ్మ నిధులపై అధికారులు విచారణ జరుపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విజేందర్‌రావు, పురుషోత్తం, బిక్షపతి, రాజభద్రయ్య పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్సైగా కమలాపూర్ వాసి



నరేశ్

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన జడల నరేశ్ ఎక్సైజ్ శాఖలో ఎస్సైగా ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తి చేసిన నరేశ్ కొంతకాలంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమై సుమారు తొమ్మిది నెలల క్రితం వెలువడిన గ్రూప్–4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికై ప్రస్తుతం హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం వెలువడిన గ్రూప్–2 ఫలితాల్లో నరేశ్ 299వ ర్యాంకు సాధించి ఎక్సైజ్ శాఖలో ఎస్సైగా ఎంపికయ్యాడు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన నరేశ్ తల్లి ప్రోద్బలంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచాడు. ఎక్సైజ్ ఎస్సైగా ఎంపికైన నరేశ్‌ను యువతతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నీ ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకులు దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఆదివారం ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు కొద్దిసేపు బ్యాట్‌పట్టి యువకులతో క్రికెట్ ఆడి వారిని ఉత్తేజపరిచారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ తంపుల మోహన్, ఎన్నికల ఇన్‌చార్జ్ గుజ్జ గోపాల్‌రావు, రాంమూర్తి, మాజీ సర్పంచ్‌లు పాలకొండ సురేష్, ఉస్మాన్ అలీ, కడుదూరి రాజు, ఎల్లగౌడ్, తీగల లక్ష్మణ్, తాటికాయల కుమార్, కాటబోయిన అశోక్, గడ్డం రఘువంశీ, నాగరాజు, రాజు, లింగారెడ్డి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ధర్మసాగర్: చెస్ నెట్‌వర్క్, ధర్మసాగర్, దండేపల్లి, ముప్పారం క్లబ్‌ల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల్లో భాగంగా హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో ఆదివారం వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలు బాలికలకు, మహిళలకు నిర్వహించారు. 72 మంది పాల్గొన్న ఈ పోటీలను సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు గుంటి స్వప్న ప్రారంభించారు. చీఫ్ ఆర్బిటర్ రజినీకాంత్, ఆర్బిటర్ శివ, ధర్మసాగర్ చెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పోటీలను సమన్వయం చేశారు. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యూరో సైకియాట్రిస్ట్ డాక్టర్ జగదీశ్‌బాబు మాట్లాడుతూ చెస్ పోటీలు జీవన నైపుణ్యాలు నేర్పిస్తూ, మానసిక శక్తిని వ్యూహాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తుందని అన్నారు. అతిథులు సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల అధినేత నారాయణరెడ్డి, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ డాక్టర్ పొన్నాల రామయ్య, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ ఆచార్యులు ఆనంద్ కిషోర్, విశ్రాంత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, విశ్రాంత ఎంపీడీవో డాక్టర్ జైపాల్ రెడ్డి, సీనియర్ న్యాయవాది యజ్ఞేశ్వర్, చెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ హరి రామోజీ, ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాష్ విజేతలకు బహుమతులు అందజేశారు.



చెస్ ఆడుతున్న బాలికలు

సంస్కృతీ, సంప్రదాయాలు నిలబెట్టుకోవాలి



పదసంచలనం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సేవకులు

దామెర: ప్రాచీన సంస్కృతీ, సంప్రదాయాలను నిలబెట్టుకోవాలని ఆర్ఎస్ఎస్ ముఖ్య వక్త కానుగుల చంద్రారెడ్డి అన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మండలకేంద్రంతో పాటు కోగిల్వాయిలో ఆదివారం పదసంచలనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 సంవత్సరంలో విజయదశమి రోజున రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాబోయే విజయదశమికి వందేళ్లు పూర్తి చేసుకుంటుందని పేర్కొన్నారు. సమరసతతో కూడిన సంఘటిత భారతదేశ నిర్మాణంలో నిమగ్నమైన సంఘం ఆర్ఎస్ఎస్ అని వెల్లడించారు. హిందూ సమాజం బలోపేతం చేయడానికి, హిందుత్వ భావజాలాన్ని వ్యాప్తి చేసేందుకు ఆర్ఎస్ఎస్ సేవకుల కృషి వెలకట్టలేనిదని అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక వక్త పోల్సాని ఇంద్రారెడ్డి, స్వయంసేవకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, రాజ్‌కుమార్, నవీన్, శ్రావణ్, రమేష్, యోగేశ్వర్, శ్రీనివాస్, మురళీధర్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

శాయంపేట : ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని నర్సింహులపల్లెలో చోటు చేసుకుంది. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం..నర్సింహులపల్లెకు చెందిన ముస్కు హరీష్ (26) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నం చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం బీటెక్ పూర్తి చేసి ప్రైవేట్ ఉద్యోగానికి ప్రయత్నాలు చేస్తుండగా ఉద్యోగం రావడంలేదని మనస్తాపంతో ఈ నెల 24న ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉన్న పురుగుల మందును సేవించాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు పరకాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్షాలతో నేలవాలిన వరిపంట

వేలేరు : ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఎప్పుడు ఇంటికి చేరుతుందా శ్రమకు తగ్గ ఫలితం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తున్న అన్నదాతలను వర్షాలు నిలువునా ముంచేస్తున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోతదశకు వచ్చిన వరిపంట నేలకొరిగింది. అలాగే కల్లాల్లో ఎండబెట్టిన మొక్కజొన్న పంట తడిచిముద్దయింది. మళ్లీ భారీ వర్షాలు పడితే పడిపోయిన పంట కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదని ముందుగా వరిసాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు.



వేలేరులో నేలవాలిన వరిపైరు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మకూరు: అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



కమలాపూర్ : 21 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూరు : 20 ఏళ్ల తర్వాత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకొని బాల్యస్మృతులను నెమరువేసుకున్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 2005–06 విద్యాసంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులంతా సమావేశమయ్యారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించుకొని సన్మానించుకున్నారు. పూర్వ హెచ్ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు అశోక్, శోభారాణి, హైమావతి, రమణాచారి, శ్రీనివాస్ లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బూర వరుణ్‌గౌడ్, వినయ్‌కుమార్, దేవేందర్, రాజ్‌కుమార్, మధు, నాగరాజు, శ్యామ్, జ్ఞానేశ్వరి, కంది భవాని, రాధిక, అనిత, కిరణ్, రమేషణ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2003–04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో తమతో పాటు చదువుకున్న బాల్య మిత్రులను కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. 21 ఏళ్ల తర్వాత తమను ఒక్కచోటకు చేర్చిన నిర్వాహకులకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అప్పటి పాఠశాల కరస్పాండెంట్ అక్కిన ప్రేమ్‌చందర్, ఉపాధ్యాయులు, వెంకన్న, పబ్బు బాలరాజు, ఊకంటి మహేందర్, నక్క కిరణ్‌కుమార్, గొట్టె లక్ష్మణ్, రాఘవేంద్రరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పూల సందడి



పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

కమలాపూర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామాల్లో పూల సందడి మొదలైంది. ఒకప్పుడు విరివిగా దొరికే తంగేడు, గునుగు, గుమ్మడి, బంతి, చామంతి, సీతజడ తదితర పూలు నేడు అరుదుగా దొరుకుతున్నాయి. దీంతో కొందరు వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి పూలను తీసుకొచ్చి మార్కెట్లలో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. సోమవారం సద్దుల బతుకమ్మ కావడంతో కమలాపూర్ గుడిబండ వద్ద నిర్వహించే మార్కెట్ ప్రాంతం ఆదివారం సాయంత్రం పూలసంతగా మారింది. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ కోసం పూల విక్రయదారులు, కొనుగోళ్ల కోసం వచ్చిన ఆడపడుచులతో మార్కెట్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.